

డాక్టర్‌గారి భార్య

– కొమ్మూరి వేణుగోపాలరావు

(గత సంచిక తరువాయి)

మైథిలి అనే స్త్రీ – అతను ప్రాక్టీస్ పెట్టిన కొత్తలోనే పరిచయమైంది.

ఒకసారి బయట ఏదో గలాభా జరుగుతున్నట్లు వినబడితే ఏమిటో చూద్దామని వెళ్ళాడు.

ఓ పాతికేళ్ళ వయసులో వున్న స్త్రీ రోడ్డుమీద ఆగిపోయి, పిచ్చి చూపులు చూస్తూ కదలకుండా నిలబడివుంది. ఆమె ప్రక్కన ఆమెకన్నా రెండు మూడేళ్ళ పెద్దదిలా కనబడుతున్న ఇంకో స్త్రీ ఆమె చెయ్యి పట్టుకుని లాగుతూ అక్కడ్నుంచి కదల్పడానికి ప్రయత్నిస్తోంది.

రోడ్డుమీద వాళ్ళంతా యీ దృశ్యం చోద్యంగా చూస్తున్నారు. ఆ రెండో స్త్రీ లజ్జితురాలవుతుంది.

వాళ్ళ దగ్గరకు వెళ్ళి "ఏమిటి?" అని అడిగాడు.

"ఈమెకు అపుడప్పుడూ ఫిట్సులా వస్తుంటాయండీ. ఒక్కొక్క సారి ఫిట్సు రావుగాని – యివిగో యిలాంటి పనులు చేస్తూ వుంటుంది. ఉన్నట్లుండి బిగుసుకుపోతూ వుంటుంది. అది యిల్లయినా సరే, రోడ్డయినా సరే."

"రండి, లోపలకు పోదాం" అన్నాడు నరేష్.

ఆమె జవాబు చెప్పకుండా అతనివైపు పిచ్చి చూపొకటి చూసి ఊరుకుంది.

అతను చొరవచేసి ఆమె చెయ్యిపట్టుకుని "హాస్పటలులోకి వెడదాం రండి" అన్నాడు.

ఆమె అతని చెయ్యి విదిలించి కొట్టి "యీయన ఎవరు నా చెయ్యిపట్టుకుంటాడు" అంది.

అతనామె విదిలింపును లక్ష్యపెట్టకుండా ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ "వస్తారా రారా?" అన్నాడు గంభీర స్వరంతో.

ఆమె అతని కళ్ళలోకి ఒక నిమిషం చూసి, తర్వాత తలవొంచుకుని లోపలకు నడిచింది.

ఆమె వెంటవున్న స్త్రీ ఆమె గురించి చెప్పింది. తనకు ఆడపడుచు అవుతుంది. మైథిలికి పధ్నాలుగో ఏటనే పెళ్ళైంది. ఆమె తండ్రి సంస్కృత పండితుడు. వేదపాఠశాలలో అధ్యాపకుడు. చాలా శ్రోత్రియమైన కుటుంబం. పెళ్ళయిన మూడోరోజునే యింకా శోభనం కాకుండానే పెళ్ళికొడుకు వైరల్ ఫీవర్‌లాంటిదేదో వచ్చి చనిపోయాడు. అప్పట్నుంచీ మైథిలికి ఫిట్స్ రావటం మొదలుపెట్టాయి.

ఆమె తండ్రి ఎంత పురాతన భావాలు కలవాడయినా, మనసు దృఢం చేసుకుని, మళ్ళీ పెళ్ళి చేస్తానన్నాడు.

ఆమె అంగీకరించలేదు.

సంస్కృతం నేర్చుకునేందుకు ప్రయత్నించింది తండ్రి దగ్గర.

కొంతకాలం సాగి మూలపడింది ఆ చదువు.

ప్రయివేటుగా చదివి డిగ్రీ సంపాదిద్దామనుకుంది.

అదీ సాగలేదు. సంవత్సరాలు గడిచిపోయి పాతికేళ్ళ వయసు వచ్చేసింది.

ఆ తర్వాత యించుమించు ఏడాది గడిచాక మైథిలి ఆడబడుచు ఒకరోజు అతనికోసమొచ్చింది.

"మైథిలికి వంట్లో బాలేదు" అంది.

"ఏం జరిగింది?"

"మూడు నెల్లబట్టి జ్వరమొస్తోంది. మా మామగారు ఆయనకు తెలిసిన ఆర్.ఎం.పి డాక్టరు ఎవరో వుంటే తీసుకొచ్చు చూపిస్తున్నారు. ఆయన టైఫాయిడ్ అని చెప్పి ఏవో మందులిచ్చి పత్యం పత్యం అని నెలల తరబడి పస్తులుంచేస్తున్నాడు. చిక్కి శల్యమైపోయింది. నాకు భయమేసి మీ దగ్గర కొచ్చాను" అన్నది.

నరేష్ ఆమెవెంట వాళ్ళ ఇంటికి వెళ్ళి చూశాడు. మైథిలి మంచమ్మీద పడుకుని వుంది. అస్థిపంజరంలా వుండి కళ్ళలో వున్నాయి ప్రాణాలు. ఆస్కల్లేట్ చేస్తే రెండు ఊపిరితిత్తులూ దెబ్బతిన్నట్లు తెలిసింది.

ఆమె తండ్రి "టైఫాయిడ్ కదూ – ఇంకా అయిదారు లంఖణాలు చేయిస్తే – అదే తగ్గిపోయి కోలుకుంటుంది" అంటున్నాడు.

"కోలుకోవటం కాదు. ఇంకాసేపట్లో రాలి పోయేటట్లు వుంది" అనుకుని "ఇమీడియట్‌గా హాస్పటల్లో ఎడ్మిట్ చెయ్యండి – కండిషన్ సీరియస్‌గా వుంది" అన్నాడు నరేష్.

"నేను చెప్పలా యీ ఇంగ్లీషు వైద్యం చేసే డాక్టర్లు ఇలాగే అంటారు. ఇంకో నాలుగు లంఖణాలు చేయిస్తే..."

"మావయ్యగారూ! వెంటనే టాక్సీ పిలిపించి హాస్పటల్‌లో జాయిన్ చేస్తారా లేదా?" అంది కోడలు గదమాయిస్తూ.

"నేను చెప్పేదేమిటంటే.."

"మీరేమి చెప్పనక్కర్లేదు దయవుంచి వెంటనే టాక్సీ పిలిపించండి?"

"సరే మీ ఇష్టం" అని నిమిషాల మీద ఆ ప్రయత్నాలు పూర్తి చేశాడు.

నెలల తరబడి ఆహారం లేక, కండిషన్ చాలా సీరియస్‌గా వుంది. వెంటనే మూడు సీసాలు గ్లూకోజ్ డ్రిప్‌గా ఇచ్చేశాడు. కాస్త నాడి వచ్చింది. బెడ్ ఎక్స్‌రే తెప్పించి, ఎక్స్‌రేలు తీయించాడు.

రెండు ఊపిరి తిత్తులూ బాగా దెబ్బతిని కేవటీలు ఏర్పడి ఉన్నాయి.

వెంటనే టి.బి ట్రీట్‌మెంట్ ప్రారంభించాడు. నాలుగయిదు రోజులకే కోలుకోవటం మొదలుపెట్టింది.

రెండు నెలలకల్లా బాగా స్వస్థత చేకూరింది.

ఆరు నెలలకల్లా చక్కగా ఒళ్ళు చేసి బంతిలా తయారయింది.

నరేష్ అంటే ఆ ఇంట్లో అందరకూ గౌరవం ఏర్పడింది. ఆ ఇంట్లో ఏమొచ్చినా అతని దగ్గరకే పరిగెత్తుకు రాసాగారు.

ఒకసారి మైథిలి తండ్రి అతంతో "బాబూ! నేను పెద్దవాడినై పోతున్నాను. వంట్లో శక్తి సన్నగిల్లిపోయింది. అబ్బాయీ, కోడలూ దేవతల్లాంటివారే అయినా నేను పోయాక దానికి అనేక సమస్యలు ఎదురౌతాయి. మళ్ళీ పెళ్ళి చెయ్యాలని మేమెంత ప్రయత్నం చేసినా అది వినటంలేదు. నీ వంటే దానికి చాలా గౌరవం. నువ్వు చెప్పి చూస్తే..?" అన్నాడు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ.

నరేష్ ఆమెకు ఎంతో ఉపాయంగా, లౌక్యంగా నచ్చచెప్పాడు. ఒకసారి కాదు. ఎన్నిసార్లో.. నెలల తరబడి ఆమెకు హితబోధ చెయ్యాల్సి వచ్చింది.

చెప్పగా చెప్పగా చివరకు ఒప్పుకుంది మైథిలి. ఒప్పుకున్నాక ఆమెకు కొత్త ఆలోచనలు, కొత్త ఆశలు కలిగాయి. జీవితం మళ్ళీ కొత్త చిగుళ్ళు తొడుగుతుందన్న నూతనోత్సాహం ఆమెలో కనిపించింది.

కొన్నాళ్ళకు ఆమె తండ్రి ఆమెకు పెళ్ళి చెయ్యగలిగాడు. పెళ్ళి కొడుకుకి కూడా రెండో సంబంధమే. భార్యపోయి రెండు మూడేళ్ళయింది. అతనికి ముప్పయిరెండు ముప్పయి మూడేళ్ళుంటాయి.

పెళ్ళయాక మొదటి రెండు మూడునెలల్లో ఏ అయిదారు రోజులో కలిసివున్నారు. అతనెప్పుడూ క్యాంపులనీ, డ్యూటీ అని ఊళ్ళు తిరుగుతుండేవాడు. నెలకు రెండు మూడు రోజులకంటే ఎక్కువ వుండేవాడు కాదు ఊళ్ళో.

మైథిలికి నెల తప్పింది.

ఆమెకు ఏడో నెల జరుగుతూండగా ఏదో ఊళ్ళో క్యాంపులో వున్న ఆమె భర్తకు జాండిస్ వచ్చింది. ఎవరికీ కబురు చెయ్యకుండా అక్కడే ఏ నాటు మందో తిన్నాడు. తగ్గలేదు. ఎక్కడో కొత్తగూడెం దగ్గర పల్లెటూళ్ళో వున్నాడప్పుడు ఉద్యోగరీత్యా. జాండిస్ ముదిరి కోమా స్థితికి వచ్చేసరికి ఆ ఊళ్ళో వాళ్ళు అతను దిక్కూ మొక్కూ లేకుండా పడివుండటం చూసి, ఎలాగో అతని ఎడ్రెస్ కనుక్కుని ఇంటికి వైరిచ్చాడు.

టెలిగ్రాం అందుకుని ఆమె తండ్రీ, అన్నగారు గాభరా పడుతూ వెళ్ళేసరికి అతని కట్టె మాత్రం మిగిలింది. గుండెలు పగిలినట్లయి, ఏం చెయ్యటానికీ తోచక – చివరకు అక్కడే ఖననం చేసి వచ్చారు.

ఈ సంగతి మైథిలికి ఎలా చెప్పాలో తెలీక నాలుగయిదురోజులు మధనపడి చివరకు చావు కబురు చల్లగా చెప్పారు.

భూకంపం వచ్చినట్లు మైథిలి తృళ్ళిపడలేదు.

ఆమె కంటినుండి ఒక నీటి బొట్టుకూడా రాలిపడలేదు.

ఆమె పెదవుల మధ్యనుండి ఆర్తనాదం వెలువడలేదు.

మైథిలి నవ్వింది.అది ఒకప్పటి హిస్టీరిక్ నవ్వుకాదు.

ఆ నవ్వులో అగాధాల అంచులున్నాయి.

ఆ నవ్వులో సృష్టి రహస్యపు లోతులున్నాయి.

నెలలు నిండాక మధ్యలో అనవసరంగా జొరబడి, తనదార్న తను వెళ్ళిపోయిన కొత్త మనిషి ఇచ్చి వెళ్ళిన పిల్లాడ్ని కని వాడ్ని చూసుకుంటూ జీవించటానికి అలవాటు పడింది.

ఇంకో అభాగిని పేరు బాలా త్రిపురసుందరి. దగ్గర్లో ఏదో పల్లెటూరు. ఇంచుమించు గంటసేపు ప్రయాణం చేసి రావాలి. ఇరవై రెండూ, ఇరవై మూడేళ్ళకంటే ఎక్కువ వుండవు. కొంచెంగా చదువుకుంది.

తండ్రి ఆ చిన్న పల్లెటూళ్ళో కిరాణా కొట్టు పెట్టుకుని జీవిస్తున్నాడు. ఈమె కాకుండా ఇంకా ముగ్గురు ఆడపిల్లలున్నారు, పెళ్ళి కావటానికి.

ఆమెకు ఆయాసం, గుండెలో నొప్పి వస్తోంటే నరేష్ దగ్గరకు వచ్చింది.

ఆమెను ఎగ్జామిన్ చేస్తోంటే కడుపు మీద రెండు ఆపరేషన్ స్కార్స్ కనిపించాయి.

"ఇదేమిటి?" అనడిగాడు.

"అయిదారేళ్ళ క్రితం తీవ్రంగా కడుపు నొప్పి వచ్చింది. డాక్టర్ల దగ్గరకి వెళితే ఎపెండిసైటిస్ అని నిర్ణయం చేసి ఆపరేషన్ చేశారు. నొప్పి తగ్గిపోయింది. కొన్నాళ్ళకు కడుపులో భరించలేని మంట, ఆహారం లోపలికి పోగానే విపరీతమైన నొప్పి, వాంతులు, అల్సర్ వున్నట్లు నిర్ణయించి మందులు వాడి వాడి ఎంతకూ తగ్గకపోతే ఆపరేషన్ చేశారు."

జనరల్ చెకప్‌గా త్రోట్ చూస్తుంటే టాన్సిల్స్ కనబడలేదు.

"టాన్సిల్స్ కూడా ఆపరేషన్ అయాయా?"

"అవును. చిన్నప్పుడు తరచు గొంతు వాస్తోంటే ఆపరేషన్ చేశారు."

ఆమెను ఎగ్జామిన్ చేశాడు. ఆస్కల్టేషన్‌లో హార్ట్‌లో మర్మర్ వినబడింది.

"చిన్నప్పుడెప్పుడైనా కీళ్ళ జ్వరంలాంటిది వచ్చిందా?"

వచ్చిందన్నట్లు తల ఊపింది.

మళ్ళీ జాగ్రత్తగా ఆస్కల్టేట్ చేశాడు . ప్రిసిస్టోరిక్ మర్మర్ ఖచ్చితంగా వినిపిస్తోంది.

మైట్రల్ స్టివోసిన్.

ఏమాత్రం పని చేసినా ఆయాసం వస్తోందనీ, గుండెదగ్గర గుయ్ గుయ్ మన్నట్లుగా వుంటుందనీ చెప్పింది.

"మీ పెద్ద వాళ్ళను తీసుకురండి మాట్లాడతాను" అన్నాడు.

"ఫర్వాలేదండి నాకు చెప్పండి. మా ఇంట్లో వ్యవహారాలన్నీ నేనే చూసుకుంటూ వుంటాను" అన్నది ఆ అమ్మాయి.

తటపటాయించి తర్వాత విధి లేక చెప్పాడు. ఆమెది రొమాటిక్ హార్ట్. ఆపరేషన్ అవసరమవుతుంది. అది ఇక్కడ చెయ్యలేరు. మద్రాస్‌గాని, రాయవెల్లురుగాని – అలాంటి చోట్లకు వెళ్ళాలి."

"ఒకవేళ ఆపరేషన్ చేయించుకోకపోతే."

"ఎప్పటికైనా హార్ట్ ఫెయిల్యూర్ వస్తుంది. అంటే వంటికి నీరు పెట్టడం, లివర్ ఎన్‌లార్జ్ కావటం, ఆయాసం ఎక్కువై.."

ఆమె కళ్ళనుండి జలజలమని నీళ్ళు కారుతున్నాయి.

"అందుకే మీ పెద్దవాళ్ళని తీసుకు రమ్మన్నాను" అన్నాడు బాధగా.

"భయంతో కాదు నా ఏడుపు. మా యింటి ఆర్థిక పరిస్థితి గురించి. ఈ ఆపరేషన్లకు వేలకు వేలు మా నాన్న ఎక్కడ్నుంచి తీసుకొస్తాడు? అదీకాకుండా మాది పల్లెటూరు. నాకు పెళ్ళి చేద్దామని శతవిధాలా ప్రయత్నిస్తున్న నాకు రెండు ఆపరేషన్లు జరిగాయని, వాటికి ఏవేవో కారణాలు ఊహించి, వ్యాపిస్తున్నాయి. ఎన్నో సంబంధాలు వస్తున్నాయి. ఇంచుమించు కుదిరే స్థితికి వచ్చి ఎందుచేతనో చివరి క్షణంలో తిరిగిపోతున్నారు. నా పెళ్ళి గురించి కాదు నాకు బెంగ – నా తర్వాత ముగ్గురున్నారు. వారి భవిష్యత్తు గురించి?"

ఆమె అప్పుడప్పుడూ వస్తూ పోతూ వుంది. పెనిడ్యూర్ ఎల్.ఎ, వగర్పుకి, హార్ట్ ఫెయిల్యూర్ రాకుండా ప్రయత్నించే టాబ్లెట్స్ వాడుతుంది.

ఒకసారి.

"స్త్రీలకు.. గుండెల్లో అంటే గుండెలని కాదు ఇక్కడ.." అంటూ వక్షోజాలవైపు చూపించి "ఇక్కడ గడ్డల్లా వుంటే ఏమవుతుంది?" అనడిగింది.

"అంటే అలా చెప్పలేను. పిల్లలు పుడితే కొత్తలో మిల్క్ ఎక్యుములేట్ అయి గ్లాండ్స్ – గాలక్టోసిల్ రావచ్చు. మామూలు యాబిసిస్‌లు అయి ఉండవచ్చు. కొంచెం వయసొచ్చాక కేన్సర్‌కు సంబంధించిన గడ్డలు రావచ్చు. ఏమీకాకుండా మామూలుగా కూడా కొన్ని రకాలుంటాయి రావచ్చు."

"నా వయసులో వున్న అమ్మాయికి రెండిట్లోనూ.. నొప్పితో కూడిన గడ్డల్లా వుంటే?"

"పేషెంటుని చూడకుండా.."

"పోనీ నాకే అనుకోండి."

ఒక్క క్షణం అప్రతిభుడై "ఎగ్జామిన్ చేయించుకుంటారా ?" అన్నాడు.

"చెయ్యండి."

ఆమెకు రెండు బ్రెస్ట్‌లలోనూ లంప్స్ వున్నాయి. కంట్రిస్టెన్సీ – హార్ట్ నొప్పి వుంది.

బహుశా.. ఫైబ్రో ఎడినోమా అయి వుండవచ్చు.

"కేన్సరా?"

"కాదులెండి. అయినా జాగ్రత్తకోసం ముక్కతీసి బయాప్స్ టెస్ట్‌కి పంపించాలి."

"తర్వాత?"

"అంటే?"

"రిపోర్ట్ వచ్చాక – సరే కేన్సరయితే వదిలెయ్యండి. కాకపోతే.. మందులు పనిచేస్తాయా?

"పని చెయ్యకపోవచ్చు."

"మరి..?"

సంకోచిస్తున్నాడు.

"ఆపరేషన్ చేయించాలి. అంతేగా?"

"అతనేం జవాబు చెప్పలేదు."

"చేయించుకోకపోతే?"

"చేయించుకోకుండా వుండకూడదు."

"ఆపరేషన్.. ఆపరేషన్.. ఆపరేషన్" అంటూ దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చింది.

సహజ ఫోన్ చేసింది.

"ఏమిటి?"

ఒక పేషెంటుని తీసుకొస్తున్నాను."

"సుగుణ అని నా చిన్ననాటి స్నేహితురాలు ఏడాది క్రితం మనము పెళ్ళికి వెళ్ళాం గుర్తుందా?"

"పూర్తిగా చూసిన పెళ్ళా? అర్జంటు కేసని కబురొస్తే మధ్యలో వచ్చేసిన పెళ్ళా?"

"పూర్తిగా చూసిన పెళ్ళేలెండి.తీసుకురానా?"

"తీసుకురా. కాని ఏమిటి?"

"వచ్చాక చెబుతాగా."

కాసేపటికి సహజ ఆ అమ్మాయిని తీసుకొచ్చింది. వెంట ఆమె భర్త తల్లిదండ్రులు కూడా వున్నారు.

చిక్కి శల్యమై, అస్థిపంజరంలా వుంది. పెళ్ళినాటి ఆమె అందమైన రూపం గుర్తువుంది. ఒక్క క్షణం ఆమె యీమేనా అని ఆశ్చర్యపోయాడు.

పెళ్ళిరోజున సుగుణ గురించి చెప్పింది సహజ. ఆమె ఆ అబ్బాయిని ప్రేమించి చేసుకుంది .ఇంట్లో వారెవరికి యిష్టంలేదు. అయినా ఎదిరించింది. ఆమెకో అక్క వుంది .ఆమెకు ఎంతకూ పెళ్ళి కుదరటం లేదు. "అక్కయ్య పెళ్ళి కాకుండా నీ పెళ్ళెలా చేస్తాం?" అన్నారు చివరకు తల్లిదండ్రులు.

"ఎన్నాళ్ళయినా సరే – ఆగుతాను" అన్నది సుగుణ.

అన్నమాట ప్రకారం ఆమె సంవత్సరాల తరబడి ఆగింది.

చివరకు ఎలాగైతేనేం ఆమె అక్క పెళ్ళి కుదిరింది.

అక్క పెళ్ళి జరిగాక కొన్నాళ్ళకు సుగుణ పెళ్ళికూడా జరిగిపోయింది.

కొత్త కాపరానికి వెళ్ళింది.

అంతవరకూ తెలుసు నరేష్‌కు. "ఏం జరిగింది?" అనడిగాడు.

సహజ చెప్పింది. అంతకుముందే వాళ్ళవల్ల విని వున్నది కనక. ఆమె నెలతప్పింది నెలలు గడుస్తున్నకొద్దీ వాంతులు ఎక్కువైపోతున్నాయి. కడుపులో వికారంతోబాటు భరించలేనంత నొప్పి. ఎంత వేవిళ్లని సరిపెట్టుకున్నా మనిషి నీరసించి పోతోంది .లేడీ డాక్టరు చూస్తూనే వుంది. నీరసం ఎక్కువైనప్పుడు సెలైన్ వగైరాలు పెడుతూనే వుంది.

మనిషి చిక్కి శల్యమైపోయింది చివరకు ... ఏడు నెలలు నిండాక ఒక చనిపోయిన బిడ్డను ప్రసవించింది.

కాని తర్వాత కూడా వాంతులు తగ్గలేదు, కడుపు తీయకపొగా ఇంకా పెరుగుతోంది. లేడీ డాక్టర్ తన అశక్తతను వెల్లడించి "ఎక్కడికైనా తీసుకెళ్ళండి" అని సలహా చెప్పింది.

"నేను సహజ దగ్గరకి వెడతాను" అని ఏడ్చింది సుగుణ.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS